సాక్షి జోగులాంబ గద్వాల

శుక్రవారం ; 22 ; నవంబర్ ; 2024



ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

జడ్చర్లలో ఎస్‌సీటీ పోలీస్ కానిస్టేబుల్స్ పాసింగ్ అవుట్ పరేడ్ ఉత్సాహంగా సాగింది.

వివరాలు 8లో ▸



ముగిసిన బ్రహ్మోత్సవాలు

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.9 /15.2

జిల్లాలో ఉదయం నుంచి చలి తీవ్రత ఉంటుంది. మధ్యాహ్నం వేళ ఎండ ఉంటుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వేరుశనగ క్వింటా రూ.6,859

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు గురువారం 253 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ. 6859, కనిష్టం రూ. 3890, సరాసరి రూ. 6386 ధరలు పలికాయి. అలాగే, 25 క్వింటాళ్ల ఆముదాలు రాగా గరిష్టం రూ. 5709, కనిష్టం రూ. 5219, సరాసరి రూ. 5709 ధరలు లభించాయి. 1158 క్వింటాళ్ల వరి (సోన) రాగా గరిష్టం రూ.2519, కనిష్టం రూ. 2001, సరాసరి ధరలు రూ. 2519 పలికాయి.

డేటా ఎంట్రీలో తప్పులకు తావివ్వొద్దు

గద్వాల: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే వివరాల డేటా ఎంట్రీ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్వే పూర్తయిన తరువాత సర్వే ఫారాలలోని అన్ని వివరాలను కంప్యూటర్లలో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఈక్రమంలో ఎక్కడా చిన్నపాటి పొరపాటుకు తావులేకుండా నమోదు చేయాలన్నారు. సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు ఫీల్డ్‌విజిట్ పూర్తి చేసిన వెంటనే డేటా ఎంట్రీ ప్రారంభించాలన్నారు. అదేవిధంగా సర్వేలో సేకరించిన వివరాలను గోప్యంగా ఉంచాలన్నారు. మండలాల లాగిన్‌లకు యూజర్ ఐడీలు, పాస్‌వర్డ్‌లు అందజేస్తామన్నారు. డేటాను ఎంట్రీ చేసే ఆపరేటర్లు కంప్యూటర్లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, డాటా ఎంట్రీ విధానాన్ని పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సర్వేను ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని ప్రతిఒక్కరు బాధ్యతగా పనిచేయాలని సర్వే విజయవంతం చేసేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈవో కాంతమ్మ, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్, మున్సిపాలిటీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీసీ కమిషన్ బహిరంగ విచారణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ కమిషన్ శుక్రవారం కలెక్టరేట్‌లోని మీటింగ్‌హాల్లో బహిరంగ విచారణ చేపట్టనుంది. సామాజిక, విద్య, వెనుకబడిన తరగతుల పరిస్థితులను తెలుసుకోవడానికి ఈ విచారణ చేపట్టనున్నారు. తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు జయప్రకాష్, సురేందర్, బాలలక్ష్మిలు రానున్నారు. మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు బీసీ సంఘాలు, సంచార జాతులు, ప్రజలు, బీసీ వర్గాలు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో అవసరమైన రిజర్వేషన్లు, దామాషాపై అభిప్రాయాలు తెలియజేయవచ్చు. ఉదయం 10 గంటలకు మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాలు, 11 గంటలకు వనపర్తి జిల్లా, మధ్యాహ్నం 12 గంటలకు గద్వాల జిల్లా, 2 గంటలకు నారాయణపేట జిల్లా, మధ్యాహ్నం 3 గంటలకు ఆయా జిల్లాలకు చెందిన వారి అభిప్రాయాలు తెలియజేయవచ్చు.

ప్రైవేటుకే మొగ్గు..



ఇటిక్యాల మండలం తిమ్మాపూర్‌లో ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాలపై రైతుల అనాసక్తి

- కొత్త నిబంధనలు.. మద్దతు ధరపై సందేహాలెన్నో..
- 62 రైస్ మిల్లులకు.. 12 మంది మిల్లర్లే బ్యాంకు పూచికత్తు
- 25 శాతం ధాన్యం ప్రైవేటు వ్యాపారులకు విక్రయం

గద్వాల: అసలే చలి తీవ్రత పెరిగింది.. వరి ధాన్యంలో తేమ శాతం ప్రభుత్వం సూచించిన 17శాతం లోపు ఉండడం కష్టమే.. ఇక ధాన్యం కొనుగోలులో కొత్త నిబంధనలతో తమ ధాన్యానికి రూ.500 బోనస్ వస్తుందా రాదా అన్న అనుమానాలు ఎన్నో. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వరకు సొంత ఖర్చులతో వాహనాల్లో తీసుకెళ్లడం మరింత భారం. ఇన్ని బాధలు పడుతూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే బదులు వ్యాపారులకు అమ్ముకోవడమే మేలని పలువురు రైతులు భావిస్తూ.. ప్రైవేట్ వ్యాపారుల విక్రయానికి మొగ్గుచూపుతున్నారనే విషయం లెక్కల ద్వారా తెలుస్తోంది. ఇదిలాఉండగా, వరి ధాన్యం రైతులకు గిట్టుబాటు ధర కల్పించి బోనస్ సైతం ఇచ్చి అండగా నిలబడతామని ప్రభుత్వం చెప్పిన హామీ కేవలం కాగితాలకే పరిమితం అని ధాన్యం కొనుగోలు ప్రక్రియ తీరును పరిశీలిస్తే అర్థమవుతుంది.

89వేల ఎకరాల్లో వరి సాగు..

జిల్లా వ్యాప్తంగా వరి పంట 89,605 ఎకరాల్లో సాగుచేశారు. ఇందులో 87,285ఎకరాల్లో సన్నరకం, 2320 ఎకరాల్లో లావు(దొడ్డు)రకం పంటను సాగుచేశారు. ఎకరాకు సుమారు 25క్వింటాళ్ల చొప్పున ఈసారి 2,08400 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం దిగుబడి రావొచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. నెలరోజుల నుంచి పంట కోతలు మొదలై ధాన్యం చేతికొచ్చినప్పటికీ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు ప్రక్రియ ద్వారా కేవలం 750 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసింది. దీంతో రైతులు చేసేది లేక ఇప్పటికే 25శాతం (50వేల మెట్రిక్ టన్నులు) ధాన్యం ప్రైవేటు వ్యాపారులకు విక్రయించారు. ఇదిలా ఉండగా మరోవైపు ప్రభుత్వం నిబంధనలతో ఇబ్బందులు పడుతున్న రైస్‌మిల్లర్లు ఇప్పటి వరకు కేవలం 12మంది రైస్ మిల్లర్లు మాత్రమే పూచికత్తు ఇచ్చారు. దీంతో ప్రభుత్వం కల్పిస్తానన్నా మద్దతు ధర, బోనస్ రైతులకు దక్కేనా అన్న మీమాంస ఏర్పడింది.

మందకొడిగా కొనుగోళ్లు

ప్రతిఏడాది మాదిరి ఈసారి రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి వారికి మద్దతు ధర కల్పించాలని నిర్ణయించింది. ఇందుకోసం పంటదిగుబడిని దృష్టిలో ఉంచుకుని జిల్లా వ్యాప్తంగా మొత్తం 64కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఇందులో 47 ఐకేపీ, 17 పీఏసీఎస్ ద్వారా ప్రారంభించారు. అయితే, ముఖ్యంగా ఏ గ్రేడ్ రకానికి రూ.2320 మద్దతు ధర, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర కల్పిస్తున్నట్లు ప్రకటించింది. అదేవిధంగా ఇందులో సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ కల్పించనున్నట్లు ప్రకటించింది. జిల్లా వ్యాప్తంగా మొత్తం 64కొనుగోలు కేంద్రాలు ప్రారంభించగా ఇప్పటి వరకు కేవలం 750 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశారంటే క్షేత్రస్థాయిలో పరిస్థితికి అద్దం పడుతుంది.

> **మద్దతు ధర కల్పిస్తాం**
>
> వరి. ధాన్యం రైతులకు ప్రభుత్వ పరంగా మద్దతు ధర కల్పిస్తాం. అలాగే సన్నరకానికి అదనంగా రూ.500బోనస్ ఇస్తాం. జిల్లాలో అన్ని చోట్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. ప్రభుత్వ నిబంధనల మేరకు జిల్లాలో ఇప్పటి వరకు 12 రైస్‌మిల్లర్లు పూచికత్తు ఇచ్చారు. మిగిలిన వారు ఇవ్వాల్సి ఉంది. అదేవిధంగా డిఫాల్ట్ మిల్లర్లకు ఎలాంటి ధాన్యం కేటాయించం.
>
> – లక్ష్మీనారాయణ, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)

25శాతం ధాన్యం ప్రైవేటు పరం

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర, అదనపు బోనస్ వంటి హామీలు కేవలం గాలికబుర్లేనని జిల్లాలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ స్పష్టం చేస్తుంది. ఈ ఏడాది వానాకాలంలో సాగుచేసిన వరిపంట జిల్లా వ్యాప్తంగా నెలరోజుల నుంచి కోతలు మొదలై పంట కూడ చేతికొస్తుంది. అయితే ప్రభుత్వం ఇస్తామన్న మద్దతు ధరకోసం ఎదురుచూసిన రైతులు పరిస్థితి అందుకు భిన్నంగా ఉండడంతో చేసేది లేక ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రధానంగా కె.టి.దొడ్డి, ధరూరు, గట్టు, మల్దకల్, అయిజ వంటి ప్రాంతాలకు చెందిన రైతులు వరిపంటను ముందుగానే సాగుచేయడంతో కోతలు కూడా నెలరోజుల నుంచే మొదలుపెట్టారు. ఇలా ఇప్పటి వరకు వ్యవసాయ శాఖ అంచనా వేసిన 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో సుమారు 25శాతం పంట అంటే 50వేల మెట్రిక్ టన్నుల ధాన్యం చేతికిరాగా, వీటిని పక్క రాష్ట్రంలోని రాయచూరు జిల్లాలో విక్రయించారు. మొదట్లో సన్నరకానికి రూ.2200–2400 ధర పలికినప్పటికీ ప్రస్తుతం ధర రూ.2000కు పడిపోయింది. దీంతో ప్రభుత్వం కల్పిస్తానన్న మద్దతు ధర రైతన్నలకు ఎడారిలో ఎండమావి మాదిరి అయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

రైస్‌మిల్లర్ల మరో సమస్య

రైతుల పరిస్థితి ఇలా ఉంటే రైస్ మిల్లర్లది మరో సమస్య. జిల్లా వ్యాప్తంగా మొత్తం 62రైస్‌మిల్లులు ఉండగా, ఇందులో 34 రైస్‌మిల్లులపై ఎలాంటి జరిమానాలు లేవు. మిగిలిన రైస్‌మిల్లర్లు గతంలో తీసుకున్న ధాన్యం వంద శాతం ప్రభుత్వానికి అప్పజెప్పకపోవడం, 11 రైస్‌మిల్లులు డిఫాల్ట్ లిస్టులో ఉండడం వంటి సమస్యలున్నాయి. తాజాగా ప్రభుత్వం విధించిన నూతన నిబంధనలు రైస్‌మిల్లర్లకు కొత్తచిక్కులు తెచ్చిపెట్టాయి. గతంలో ప్రభుత్వ ధాన్యాన్ని బొక్కేసి రూ.కోట్లలో ప్రభుత్వానికి కుచ్చుటోపీ పెట్టిన రైస్‌మిల్లర్లకు అడ్డుకట్ట వేసేందుకు తీసుకునే ధాన్యానికి సరిపడా బ్యాంకు నగదు గ్యారెంటీ, అండర్‌టేకింగ్ పూచికత్తు వంటి నిబంధనలు విధించింది. ఈ నిబంధనల కారణంగా జిల్లాలో ఇప్పటి వరకు కేవలం 12మంది రైస్‌మిల్లర్లే పూచికత్తు ఇచ్చినట్లు సమాచారం. మొత్తంగా కొనుగోలు ప్రక్రియలో నెలకొన్న సమస్యలు అధిగమించి రైతులకు మద్దతు ధర కల్పించడంలో అధికారులు ఎంతమేర సఫలీకృతం అవుతారో వేచి చూడాలి.



మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేస్తున్న బీజేపీ నాయకులు

ఇరువర్గాల మధ్య ఘర్షణ

గద్వాల రూరల్: కొనుగోలు కేంద్రం ఏర్పాటులో అధికార పార్టీలోని ఇరువర్గాలు ఘర్షణకు దిగారు. చివరకు వారి పంచాయితీ పోలీస్‌స్టేషన్‌కు చేరడంతో విచారించి నిర్ణయం తీసుకునే వరకు ఎవరు కొనుగోలు చేయొద్దని పోలీసులు సూచించడంతో ఘర్షణ సద్దుమణిగింది. వివరాల్లోకి వెళ్తే.. గద్వాల మండలం బీరెల్లి గ్రామంలో ఐకేపీ ద్వారా కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అధికారులు ఏర్పాటు చేశారు. గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవితో పాటు కార్యవర్గం మొదట నెహ్రూ సంఘంలోని సుజాత టీమ్ కొనుగోలు కేంద్రం నిర్వహించేందుకు తీర్మానం ఇచ్చింది. దీంతో వారు అన్ని ఏర్పాటు చేశారు. గురువారం వాళ్ల కేంద్రం ప్రారంభించగా, ఈ క్రమంలో మరో సంఘం వాళ్ల తమకే అనుమతులు వచ్చాయని, మీరు ప్రారంభించడానికి వీలు లేదంటూ అడ్డుకున్నారు. మొదటి సంఘానికి మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ సరిత వర్గీయులు మద్దతు తెలుపగా, రెండో సంఘం వారికి ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి వర్గీయులు మద్దతు తెలిపారు. రెండు వర్గాలు పరస్పరం అరుపులు, కేకలు వేసుకుంటూ ఒకరిపై ఒకరు పిడిగుద్దులకు దిగారు. ఈ విషయం సీఐ టంగుటూరు శ్రీను దృష్టికి తీసుకెళ్లడంతో రెండు వర్గాలను స్టేషన్ పిలిచి, కొనుగోలు కేంద్రం ప్రారంభించవద్దని, కలెక్టర్, డీఆర్‌డీఓ విచారణ చేపట్టి అలాట్ చేస్తారని తెలిపారు.



గట్టులో భవాని మాత రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

కనులపండువగా భవాని మాత రథోత్సవం

గట్టు: గట్టులో కొలువుదీరిన అంబాభవాని మాత బ్రహ్మోత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. భక్త జనసంద్రం మధ్య భవాని మాత అమ్మవారి రథోత్సవాన్ని బుధవారం అర్ధరాత్రి నిర్వహించారు. రథాన్ని భక్తులు భక్తి పారవశ్యంతో ముందుకు లాగారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి మహారాష్ట్రలోని ముంబాయి, షోలాపూర్, కొల్హాపూర్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, కొడుమూర్, గుడూర్, నంద్యాల, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల ప్రాంతాల నుంచి క్షత్రియ కులస్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. భక్తులతో సంత బజారులోని ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. ప్రత్యేకంగా విద్యుత్ దీపాలతో అలంకరించిన రథంపై అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేసి రథోత్సవాన్ని నిర్వహించారు. భవానిమాత ఆలయం నుంచి చావిడి దగ్గరున్న లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయం వరకు ఊరేగింపు కొనసాగింది. ప్రత్యేకంగా బాణా సంచా కాల్చారు. ఆలయంలో రాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి రథోత్సవాన్ని నిర్వహించారు. ఎస్‌ఐలు మల్లేష్, నందికర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌కే సమాజ్ అధ్యక్షుడు పెద్ద అంబుసా, ఆలయ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, గోవిందు, ఈరన్న,చంద్రమోహన్,వినోద్, లక్ష్మణ్, వినోద్ పాల్గొన్నారు.



కొలువుదీరిన భవాని మాత అమ్మవారు

భక్తిని చాటుకున్న 75 ఏళ్ల వృద్ధురాలు

గట్టుకు చెందిన 75 ఏళ్ల వృద్ధురాలు చాపత్తి ఎల్లమ్మ ఉపాధి కోసం కుటుంబంతో బెంగళూరుకు వెళ్లి అక్కడే స్థిర పడింది. అయితే, ప్రతిఏటా గట్టులో నిర్వహించే అంబాభవాని మాత ఉత్సవాలకు ఆమె బెంగళూరు నుంచి రావడంతో పాటు వేల రూపాయలు వెచ్చించి అక్కడి నుంచి పూలను తీసుకువచ్చి భక్తిని చాటుకుంటుంది. ప్రస్తుతం నిర్వహిస్తున్న ఉత్సవాలకు బెంగళూరు నుంచి రాయచూరుకు అక్కడి నుంచి గట్టుకు సుమారు రూ.60 వేల విలువ చేసే వివిధ రకాలను పూలను వృద్ధురాలు తీసుకురాగా, వాటిని గర్భగుడితో పాటుగా రథానికి అలంకరించారు. అనంతరం ఎల్లమ్మను ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు.



రాయచూర్ రైల్వే స్టేషన్‌లో పూల సంచులతో వృద్ధురాలు ఎల్లమ్మ

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ
- ఘనంగా ప్రజాపాలన విజయోత్సవం

గద్వాలటౌన్: రాష్ట్ర ప్రభుత్వం అన్ని రంగాల అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి తగిన ప్రాధాన్యం ఇస్తుందని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రభుత్వ ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమానికి ఆయనతో పాటు అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు, సంగీత నాటక ఆకాడమి చైర్‌పర్సన్ అలేఖ్య ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చారని, ఇచ్చిన ప్రతి హామీకి కట్టుబడి ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని గుర్తుచేశారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి వరి కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యంతో మహిళలకు లబ్ధి చేకూరుతుందని చెప్పారు. అర్హులకు గ్యాస్ సిలిండర్ రూ.500కి, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు. దేశ చరిత్రలో ఎక్కడా లేనివిధంగా రైతులకు రూ.31 వేల కోట్ల పంట రుణాలను మాఫీ చేసి అన్నదాతలపై ఉన్న చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. రైతులకు కనీస మద్దతు ధరతో పాటు సన్న బియ్యానికి క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తోందని చెప్పారు. ఏడాది కాలంలోనే ప్రభుత్వం 50 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని వివరించారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పరంగా ప్రయోజనం చేకూర్చాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక పరిస్థితుల విశ్లేషణ కోసం ఇంటింటి సమగ్ర సర్వే జరిపిస్తుందన్నారు. కార్యక్రమంలో అలంపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ, వడ్డేపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ



సాంస్కృతిక నృత్యాలతో ఆకట్టుకున్న చిన్నారులు

అలరించిన ప్రదర్శనలు

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పండగల ప్రాముఖ్యతను చాటుతూ కళాకారులు ప్రదర్శించిన నృత్యరూపకం ప్రత్యేకంగా నిలిచింది. తెలంగాణ అమరవీరులు, కవులు, కళాకారులు, పల్లె సంస్కృతి, గ్రామ దేవతల బోనాలు, పోతురాజుల విన్యాసాలు, బతుకమ్మ వేడుకలను ప్రతిబింబిస్తూ తమ అభినయాలతో అలరించారు. అంతకు ముందు సాంస్కృతిక సారథి కళాకారులు ఆలపించిన పాటలు, నృత్యాలు ప్రజాపాలన విశిష్టతను చాటాయి. వివిధ ప్రదర్శనలతో ప్రాంగణమంతా సందడిగా మారింది.

దాడులకు పాల్పడటం అనాగరిక చర్య



అలంపూర్‌లో కోర్టు ఆవరణలో నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అలంపూర్: న్యాయవాదులపై భౌతిక దాడులకు పాల్పడటం ఆనాగరిక చర్య అని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్ అన్నారు. అలంపూర్ పట్టంలోని కోర్టులో న్యాయవాదులు హసురు ఘటనకు నిరసనగా గురువారం విధులను బహిష్కరించారు. కోర్టు ఆవరణలో నినాదాలు చేశారు. అనంతరం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేష్ కుమార్ అధ్వర్యంలో న్యాయవాదులు అత్యవసర సమావేశం నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రంలోని హసురులో న్యాయవాదిపై జరిగిన దాడికి నిరసనగా రెండు రోజులు కోర్టు కార్యకలాపాలకు దూరంగా ఉండాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. తీర్మానం కాపీని న్యాయమూర్తి మిథున్‌తేజకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్యాయానికి గురైనవారు ప్రజాస్వామ్య పద్ధతిలో న్యాయపోరాటం చేయాలని, భౌతిక దాడులకు పాల్పడడం సరికాదన్నారు. దాడి చేసిన వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి గవ్వల శ్రీనివాసులు, కర్నూల్ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చాంద్ బాష, న్యాయవాదులు రాజేశ్వరి, నారయణ రెడ్డి, తిమ్మారెడ్డి, నాగరాజు యాదవ్, శ్రీధర్ రెడ్డి, గజేంద్రుడు, వెంకట్రాముడు, మధు, వజ్ర భాస్కర్ పాల్గొన్నారు.

మారని తీరు..

మాగనూర్ జెడ్పీస్కూల్‌లో మధ్యాహ్న భోజనంలో మళ్లీ పురుగులు

- అన్నం పారబోసి విద్యార్థుల ఆందోళన
- హుటాహుటిన పాఠశాలను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్
- విద్యార్థుల అస్వస్థతపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టిన కలెక్టర్

నారాయణపేట/మక్తల్/మాగనూర్: దాదాపు వంద మంది విద్యార్థులు నాణ్యత లేని మధ్యాహ్న భోజనం తిని ఆస్పత్రి పాలు అయినా సదరు సిబ్బంది తీరు మారడంలేదు. గురువారం సైతం మధ్యాహ్న భోజనంలో పురుగులు రావడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. బుధవారం మాగనూరు జెడ్పీ పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేకపోవడంతో ఆ ఆహారం తిన్న దాదాపు వంద మంది విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయింది. వారి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మక్తల్, మహబూబ్‌నగర్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన విషయం తెలిసిందే. సరిగ్గా ఒక్కరోజు కూడా కాకముందే మరోసారి అన్నంలో పురుగులు రావడం.. కలెక్టర్ ఆదేశించినా సదరు సిబ్బంది నిర్లక్ష్యం వీడకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

విద్యార్థుల అస్వస్థతపై కలెక్టర్ విచారణ

జిల్లాలోని మాగనూరు జెడ్పీహెచ్ఎస్‌లో బుధవారం మధ్యాహ్న భోజనం కలుషితమై విద్యార్థులు అస్వస్థతకు గురైన సంఘటనపై గురువారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. పాఠశాల వంట గది, స్టోర్ రూం, వంటకు వినియోగించే బియ్యం, నిత్యావసరాల సరుకులను పరిశీలించారు. పాఠశాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఆరా తీశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఇకపై ప్రతిరోజు మధ్యాహ్న భోజనాన్ని పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు పరిశీలించి, రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని ఆదేశించారు. ఈ సంఘటనలో 17 మంది విద్యార్థులకు వాంతులతో అస్వస్థతకు గురయ్యారని, వారిని మక్తల్ సీహెచ్‌సీ, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు అందించినట్లు తెలిపారు. తాజాగా మహబూబ్‌నగర్ కలెక్టర్, ఆస్పత్రి సూపరింటెండెంట్‌కు సమాచారం అందించి విద్యార్థుల యోగక్షేమాలు తెలుసుకున్నామని, ప్రస్తుతం విద్యార్థులు కోలుకుంటున్నారని, వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని కలెక్టర్ వెల్లడించారు. ఈ ఘటనపై పాఠశాల హెచ్‌ఎంను సస్పెండ్ చేయడంతో పాటు వంట ఏజెన్సీని రద్దు చేసి ఇతర ఏజెన్సీకి అప్పగిస్తున్నట్లు తెలిపారు. ఇక నుంచి ప్రతి పాఠశాలలో టెస్టింగ్ (నాణ్యత పరిశీలన) కమిటీని ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. బియ్యాన్ని, మార్కెట్ నుంచి వచ్చే కూరగాయలు, కోడిగుడ్లను పరిశీలించిన తర్వాతే పాఠశాలకు తీసుకురావాలని సూచించారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా హెడ్మాస్టర్లు, వంట ఏజెన్సీలు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు.



బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్



అన్నం గిన్నెలను పరిశీలిస్తున్న డీఈఓ అబ్దుల్ ఘని

అధికారులపై చర్యలు..

ఇదిలా ఉండగా, స్వయంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాగనూర్ పాఠశాలను సందర్శించి స్టాక్‌రూంలోని బియ్యాన్ని పరిశీలించారు. ఆ సమయంలో బియ్యంలో కలెక్టర్‌కు పురుగులు కనిపించలేదు. అయితే, అనంతరం అధికారుల పర్యవేక్షణలో హాస్టల్ సిబ్బంది మధ్యాహ్న భోజనం వండారు. సదరు అన్నంలో పురుగులు రావడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు అన్నం తినకుండా పారబోసి ఆందోళనకు దిగారు. కలెక్టర్‌ను ఇక్కడి అధికారులు తప్పుదోవ పట్టించారా.. వండే వారు నిర్లక్ష్యంగా వ్యవహరించారా అనేది విచారణ చేపడితే తప్పా బయటపడదంటూ వాపోయారు. చివరికి అధికారులు బియ్యం కొనుగోలు చేసి తీసుకువచ్చారు. సాయంత్రం 4 గంటలకు మరోమారు అన్నం వండి విద్యార్థులకు పెట్టారు. గురువారం వండిన అన్నంలో మరోసారి పురుగులు రావడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. డీఈఓ అబ్దుల్ ఘనీని సస్పెండ్ చేశారు. అలాగే ఆర్డీఓ, ఎంపీడీఓ, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ ఘటనపై పూర్తి విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. అన్నంలో పురుగులు రావడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. మీ పిల్లలకు ఇలాంటి అన్నమే పెడతారా అని ప్రశ్నించారు. ఆయన సొంత డబ్బులతో బియ్యం కొనుగోలు చేసి పాఠశాలకు అందించారు.

క్లుప్తంగా

పురుగు మందు తాగి మహిళ ఆత్మహత్య

మానవపాడు: మతిస్థిమితంలేని వివాహిత పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పెద్ద పోతులపాడులో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రకాంత్ వివరాల ప్రకారం.. మండలంలోని పెద్దపోతులపాడుకు చెందిన లక్ష్మీదేవి(49)నెల రోజులుగా మతిస్థిమితం సరిగా లేకపోవడంతో భర్త చిన్న మద్దిలేటి చాలా ఆరోగ్యకేంద్రాల్లో చికిత్స చేయించాడు. అయినా ఆరోగ్యం కుదుటపడలేదు. ఈ నెల 20న మధ్యాహ్నం 12గంటల సమయంలో ఇంట్లో ఎవరు లేని సమయంలో లక్ష్మీదేవి పురుగుల మందు తాగింది. ఈ విషయం తెలిసిన వెంటనే కుమారుడు రామాంజనేయులు ఆమెను కర్నూల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి గురువారం తెల్లవారుజామున ఆమె మృతి చెందింది. ఆమె కుమారుడు రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కుటుంబ కలహాలతో మరో వ్యక్తి..

నవాబుపేట: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పోమాల్ గ్రామంలో చోటుచేసుకుంది. గురువారం గ్రామానికి చెందిన జగదీష్‌గౌడ్(46) కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.జగదీష్‌గౌడ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

భూత్పూర్: మున్సిపాలిటీకి చెందిన దాసరి మునయ్య (45) గురువారం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం మేరకు.. మునయ్య ఈ నెల 17న రాత్రి శివాలయం ఎదురుగా బహిర్భూమికి వెళ్లి తిరిగి వస్తుండగా బిజినపల్లి నుంచి భూత్పూర్ వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో తలకు బలంగా గాయాలు కావడంతో జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పదంగా మరొకరు..

చిన్నంబావి: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన కాలూరులో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వీపనగండ్ల మండలంలోని సంపత్రావుపల్లికి చెందిన సుధాకర్(44) దంపతులు కాలూరు గ్రామానికి చెందిన రామకృష్ణారావు తోటవద్ద కూలీ పనికి ఏడు నెలల క్రితం చేరారు. తోటలో ఏర్పాటు చేసిన ఇంటిలో యథావిధిగా బుధవారం రాత్రి భోజనం చేసి పడుకున్నాడు. ఉదయం లేచి చూసేసరికి సుధాకర్ మృతిచెందాడు. ఆయన మృతిపై పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఇన్‌చార్జి పోలీస్ అధికారి శాంతన్న తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


పరేడ్ నిర్వహిస్తున్న నూతన కానిస్టేబుల్స్..


పరేడ్ కమాండెంట్ మోహన్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

జడ్చర్ల డీటీసీలో పోలీస్ పాసింగ్ అవుట్ పరేడ్

- ఉమ్మడి ఆదిలాబాద్‌కు చెందిన 270 మందికి శిక్షణ పూర్తి
- విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీపీ శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ప్రశంసలు
- ఆకట్టుకున్న కానిస్టేబుళ్ల కవాతు

జడ్చర్ల: జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో గురువారం నిర్వహించిన ఎస్‌సీటీ పోలీస్ కానిస్టేబుల్స్ (సివిల్) పాసింగ్ అవుట్ పరేడ్ ఉల్లాసంగా, ఉత్సాహంగా కొనసాగింది. కార్యక్రమానికి రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి, జోగుళాంబ జోన్ డీఐజీ ఎల్ఎస్ చౌహాన్, మహబూబ్‌నగర్, వనపర్తి ఎస్పీలు జానకి, రావుల గిరిధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన 270 మంది అభ్యర్థులు జడ్చర్ల డీటీసీలో 9 నెలలపాటు శిక్షణ పొందారు. సమర్థవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు పాసింగ్ అవుట్ పరేడ్‌తో వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అభ్యర్థులు నిర్వహించిన కవాతు అందరినీ ఆకట్టుకుంది. జాతీయ జెండాతో పాటు పోలీస్ జెండాల సాక్షిగా గౌరవ వందనం చేశారు. డీజీపీ శ్రీనివాస్‌రెడ్డితో పాటు, డీఐజీ చౌహాన్, ఎస్పీలు గౌరవ వందనం స్వీకరించారు. పరేడ్ కమాండెంట్ సుంకని మోహన్ ఆధ్వర్యంలో కవాతు కొనసాగగా.. ఎస్పీ జానకి శిక్షణ పూర్తిచేసుకున్న కానిస్టేబుల్స్‌తో ప్రతిజ్ఞ చేయించారు. తదుపరి శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారితో పాటు శిక్షణ ఇచ్చిన ఇండోర్ సిబ్బందికి డీజీపీ మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

మంచి శిక్షణ పొందాం..



జడ్చర్ల డీటీసీలో తొమ్మిది నెలలపాటు మంచి శిక్షణ పొందాం. శిక్షణలో నేర్చుకున్న అంశాలు పోలీసు ఉద్యోగంలో ఎంతో ఉపయోగపడతాయి. ప్రజలకు మంచి సేవలు అందించేందుకు కృషి చేస్తా. పోలీసు ఉన్నతాధికారులు చెప్పిన విధంగా, ఉన్నత ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్తాను.

– నవీన్ ,కాల్వ, నిర్మల్ జిల్లా

ప్రజలకు సేవచేసే భాగ్యం..



పోలీస్‌గా ఎంపిక కావడం అదృష్టంగా భావిస్తున్నా. ప్రజలకు సేవచేసే భాగ్యం కలిగింది. పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకువచ్చే విధంగా పనిచేస్తాను. శిక్షణలో ఎన్నో మంచి విషయాలు నేర్చుకున్నాను.

– మనోజ్ కుమార్, సిద్దిపేట

చాలా సంతోషంగా ఉంది..


కొడుకు నిఖిల్‌తో తల్లిదండ్రులు లక్ష్మీనర్సయ్య, కవిత

తమ కుమారుడు గడుగు నిఖిల్ ఎంతో పట్టుదలతో పోలీస్ ఉద్యోగం సంపాదించాడు. జడ్చర్ల డీటీసీలో సమర్థవంతంగా శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరబోతున్నాడు. మా కుమారుడు పోలీస్ కావడం అదృష్టంగా భావిస్తున్నామంటూ నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన లక్ష్మీనర్సయ్య - కవిత దంపతులు సంబురపడ్డారు.

పోలీస్ కుటుంబం..


సంతోషం వ్యక్తంచేస్తున్న యశ్వంత్‌రావు, హేమలత

మా ఇంట్లో అందరూ పోలీస్‌లేనని ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెళ్లికి చెందిన హేమలత - యశ్వంత్‌రావు దంపతుల సంతోషం అంతా ఇంతా కాదు. ఇప్పటికే తమ కుమారులు వెంకటరమణ, సంతోష్ పోలీస్ కానిస్టేబుల్స్‌గా విధులు నిర్వర్తిస్తున్నారని.. చిన్న కుమారుడు దుర్వ సంజీవ్ కూడా జడ్చర్ల డీటీసీలో శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరబోతున్నాడని చెప్పారు. ఇక తమ కూతురును పెళ్లి చేసుకున్న అల్లుడు కూడా పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్నారని ఈ సందర్భంగా వారు తెలిపారు.

ఒకే బ్యాచ్‌లో ముగ్గురు అన్నదమ్ముళ్ల ఎంపిక..


తమ ఇద్దరు కుమారులతో తల్లిదండ్రులు శంకరమ్మ, శివలింగం

పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఒకే సారి ముగ్గురు అన్నదమ్ముళ్లు ఎంపికయ్యారు. ఆసిఫాబాద్ జిల్లా బాబాసాగర్‌కు చెందిన మహేందర్, ఉపేందర్, విజయ్‌కుమార్ అన్నదమ్ముళ్లు. వీరిలో మహేందర్, ఉపేందర్‌లు జడ్చర్ల డీటీసీలో శిక్షణ పొందారు. మరో సోదరుడు విజయ్‌కుమార్ యూసూఫ్‌గూడలో వచ్చే వారం శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరనున్నాడు. తమ ముగ్గురు కుమారులకు పోలీసు ఉద్యోగాలు రావడంతో తల్లిదండ్రులు శివలింగం, శంకరమ్మల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఇన్నాళ్లు తాము పడ్డ కష్టాలు, కన్నీళ్లు దూరమయ్యాయని ఈ సందర్భంగా వారు 'సాక్షి'తో తమ సంతోషం పంచుకున్నారు.

మంచిపేరు సంపాదించాలి..


కుమారుడు జగదీష్ కుమార్‌తో తల్లిదండ్రులు రామారావు, గంగుబాయి

పోలీస్ కావాలన్న ఆకాంక్షతో మా కుమారుడు జగదీష్ కుమార్ ప్రయత్నించాడు. తొలి ప్రయత్నంలోనే పోలీస్‌గా ఎంపికయ్యాడు. మాకు చాలా సంతోషంగా ఉందంటూ ఆదిలాబాద్ జిల్లా రాంపూర్‌కు చెందిన రామారావు, గంగుబాయి పేర్కొన్నారు. జడ్చర్ల డీటీసీలో శిక్షణ పొంది, ప్రజలకు సేవచేసే అవకాశం లభించడం అదృష్టంగా భావిస్తున్నట్లు వారు తెలిపారు.

జూరాలకు పెరిగిన ఇన్ ఫ్లో

- జల విద్యుత్ కేంద్రంలో విద్యుదుత్పత్తి ప్రారంభం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న ఇన్ ఫ్లో స్వల్పంగా పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జెన్‌కో జల విద్యుత్ కేంద్రంలో ఒక యూనిట్‌లో కొనసాగుతున్న విద్యుదుత్పత్తిని ప్రారంభించినట్లు జెన్‌కో అధికారులు తెలిపారు. గురువారం సాయంత్రానికి ప్రాజెక్టు వస్తున్న ఇన్‌ఫ్లో 8500 క్యూసెక్కులకు పెరిగినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. విద్యుదుత్పత్తి నిమిత్తం 7,336 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 71 క్యూసెక్కులు, ఎడమ కాలువకు 390 క్యూసెక్కులు, కుడి కాల్వకు 530 క్యూసెక్కులు, భీమా లిఫ్టు-1కు 630 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 100 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 8.977 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 9.657 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు.

హత్య కేసులో ముగ్గురికి రిమాండ్

- వివరాలు వెల్లడించిన గద్వాల సీఐ

గద్వాల క్రైం: భూ తగాదాలతో హత్య చేసిన ఘటనలో ముగ్గురు కుటుంబ సభ్యులను గురువారం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు గద్వాల సీఐ శ్రీను తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఈ నెల 15న గట్టు మండలం ఆరగిద్దలో హరిజన నల్లన్న (58) పొలం దగ్గర ఉండగా పక్క పొలానికి చెందిన ఆయన బంధువులు బెండల్ ఉస్సేన్, బెండల్ చిన్న తిమ్మన్న, బెండల్ కుంటెన్న గొర్రెలను మేపేందుకు తీసుకొచ్చారు. పొలంలో పత్తి పంట ఉండగా గొర్రెలు రావడంతో నల్లన్నతో పాటు అతడి కుమారుడు సంజీవులు వారితో గొడవ పడ్డారు. ఈ దాడిలో నల్లన్న, సంజీవులుపై రాళ్లు, కర్రలతో ముగ్గురు దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 18న నల్లన్న మృతిచెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసుకొని నిందితుల కోసం గాలింపు ప్రారంభించారు. బుధవారం సాయంత్రం మల్దకల్ బస్టాండ్ ప్రాంతంలో పోలీసులు గుర్తించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. గద్వాల కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీలో విజేతగా నిలవాలి


సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో డీవైఎస్ఓ శ్రీనివాస్

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా జట్టు విజేతగా నిలవాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. మెదక్ జిల్లా మూసాయిపేటలో ఈనెల 23 నుంచి 24వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాలుర జట్టు ఎంపికలు జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీవైఎస్ఓ క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడుతూ క్రీడల్లో క్రమశిక్షణతో మెలగాలని కోరారు. సమష్టిగా ఆడితే విజయం సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో కోచ్ సాధిక్‌అలీ, ఆనంద్ కుమార్, సుగుణ, రాఘవేందర్, నాగరాజు, నాగమణి, మేరిపుష్ప, ఉమాపతిరెడ్డి, రాంమోహన్, శ్రీను, జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉమ్మడి జిల్లా రగ్బీ ఎంపికలు


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్‌జీఎఫ్ కార్యదర్శి శారదాబాయి, డీవైఎస్ఓ

మహబూబ్‌నగర్ క్రీడలు: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు మెరుగైన ప్రతిభ కనబరిచి చాంపియన్‌గా నిలవాలని జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి శారదాబాయి అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో గురువారం ఎస్‌జీఎఫ్ ఉమ్మడి జిల్లా అండర్-14 విభాగం బాలబాలికల రగ్బీ ఎంపికలు నిర్వహించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని ఆమె మాట్లాడుతూ ఎంపికలకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 150 మంది బాలబాలికలు హాజరైనట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి టోర్నీల్లో విజేతగా నిలిచి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ మాట్లాడుతూ నిరంతరం ప్రాక్టీస్ చేస్తే క్రీడల్లో ఉన్నతస్థానాలకు ఎదగవచ్చని అన్నారు. జిల్లా క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీ యస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పీడీలు వేణుగోపాల్, జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్ రావు, ఉమాపతిరెడ్డి, పరశురాములు, బాల్‌రాజు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్‌ను ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

- జాతీయ రహదారిపై తప్పిన ప్రమాదం
- బస్సులోని 30మంది ప్రయాణికులు సురక్షితం

మానవపాడు: జాతీయ రహదారి-44పై ముందు వెళ్తున్న కంటైనర్‌ను అతివేగంగా వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీ కొట్టిన సంఘటన గురువారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఎస్ఐ చంద్రకాంత్ కథనం ప్రకారం.. మంచిర్యాల నుంచి బెంగుళూరు వెళ్తున్న బస్సులో దాదాపు 30మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు జల్లాపురం శివారు ప్రాంతంలోకి రాగానే ముందు వెళ్తున్న కంటైనర్‌ను వెనక నుంచి ఢీకొట్టింది. కంటైనర్ రహదారి కిందకి వెళ్లి బోల్తా పడింది. బస్సు వేగం అదుపు చేయలేకపోవడంతో రాంగ్‌రూట్‌లోకి వెళ్లి జల్లాపురం శివారులోని చెక్‌పోస్ట్ సమీపంలో నిలిచింది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన షేక్ అహ్మద్ ఆజాంకు గాయాలయ్యాయి. మిగితా ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. మిర్యాలగూడకు చెందిన బస్సు డ్రైవర్ బత్తుల రమేష్ అతివేగం, అజాగ్రత్తగా నడపడం వల్ల ఈ ప్రమాదం చోటుచేసుకుంది. రాజస్థాన్‌కు చెందిన కంటైనర్ డ్రైవర్ హర్బజ్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. గాయపడిన షేక్ అహ్మద్ ఆజామ్ తమ్ముడు అహ్మద్ ఆదిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.


జాతీయ రహదారిపై సురక్షితంగా బయటపడ్డ ప్రయాణికులు.

హత్యనా? ఆత్మహత్యనా

పెద్దకొత్తపల్లి: వివాహిత ఫ్యాన్‌కు వేలాడుతుండడంతో హత్య చేశారా? ఆత్మహత్య చేసుకుందా? అనే సందిగ్ధంలో సంఘటన చోటుచేసుకుంది. భర్త వేధింపులు తాళలేక ఆమె ఆత్మహత్య చేసుకుందా? భర్త కొట్టి చంపి ఉరేశాడా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మహాసముద్రం గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల ప్రకారం.. పాన్‌గల్ మండలం చిక్కేపల్లికి చెందిన బాలకృష్ణతో మహాసముద్రం గ్రామానికి చెందిన ప్రశాంతి(21)కి గతేడాది వివాహమైంది. వివాహమైనప్పటి నుంచి ప్రశాంతిని వేధింపులకు గురిచేయడంతో మహాసముద్రం గ్రామానికి వచ్చింది. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భర్త వచ్చి ఆమెను తీవ్రంగా కొట్టి చంపి ఫ్యాన్‌కు ఉరేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. బాలకృష్ణ గ్రామం నుంచి పరారయ్యాడు. ఆమె ప్రస్తుతం గర్భావతని సమాచారం. ఆమె మృతదేహాన్ని పోలీసులు నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆమె కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయలేదని పోలీసులు తెలిపారు. ప్రశాంతిని హత్యనా? ఆత్మహత్యనా? అనేది తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో మహిళ బలవన్మరణం

శాంతినగర్: ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. శాంతినగర్‌లోని వడ్డేపల్లి రోడ్డులో పసిరికల మందు ఇచ్చే నాగమణి (54) కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తిచెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలికి భర్త సీతాపతి, ఇద్దరు కుమారులు ఉన్నారు.



ముగిసిన కురుమూర్తి బ్రహ్మోత్సవాలు

- స్వామివారి మూలవిరాట్‌కు ఆభరణాల తొలగింపు
- ఆత్మకూర్ ఎస్‌బీఐకి తరలింపు


కురుమూర్తి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


ఆత్మకూర్ ఎస్‌బీఐకి తీసుకెళ్తున్న స్వామివారి ఆభరణాలు

చిన్నచింతకుంట/ఆత్మకూర్: కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 6న స్వామి వారికి అలంకరించిన ఆభరణాలను అధికారుల సమక్షంలో సంప్రదాయ బద్ధంగా ఆలయ పూజారులు తొలగించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి.. పోలీసుల కట్టుదిట్టమైన భద్రత నడుమ ఆత్మకూర్ ఎస్‌బీఐకి ఆభరణాలను తరలించారు. సాయంత్రం ఆత్మకూర్ ఎస్‌బీఐలోని లాకర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆభరణాలను భద్రపరిచారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు, జాతరను పురస్కరించుకొని ఇప్పటి వరకు 10 లక్షల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నట్లు ఆలయ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈఓ మదనేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్వామివారి ఆభరణాలను తొలగించినప్పటికీ అమావాస్య వరకు జాతర కొనసాగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

పోటెత్తిన భక్తజనం..


స్వామివారి ఆభరణాలను అధికారులకు అందజేస్తున్న అర్చకులు

కురుమూర్తిస్వామి జాతరకు భక్తులు పోటెత్తారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులతో క్యూలైన్ కిక్కిరిసి కనిపించింది. ఉద్దాల మండపంలో స్వామివారి పాదుకలను దర్శించుకుని పునీతులయ్యారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణ మార్మోగింది. ఆలయ ముఖద్వారం నుంచి స్వామివారి ప్రధాన ఆలయం వరకు మెట్లపై, ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని ముడుపులు కట్టారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆర్.శేఖర్, ఆలయ సిబ్బంది, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లి మృతదేహం వైద్య కళాశాలకు..


చెన్నమ్మ (ఫైల్)

నవాబుపేట: మండలంలోని లోకిరేవుకు చెందిన గొర్రెంక చెన్నమ్మ (90) అస్వస్థతకు గురికావడంతో ఆమె కుమారుడు కృష్ణయ్య గురువారం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకొస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందింది. తన తల్లి కళ్లు వేరొకరికి చూపును ప్రసాదించాలని ఆకాంక్షించి కుమారుడు హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ ఆస్పత్రికి కళ్లను దానం చేశారు. అలాగే ఆమె మృతదేహం వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలంటూ నారాయణపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు అందజేశారు.


ఆస్పత్రి సిబ్బందికి మృతదేహం అప్పగిస్తున్న కృష్ణయ్య